హోం / ప్రవాస /

# డాలస్‌లో ఘనంగా భారత స్వాతంత్ర్య దినోత్సవం

17-08-2016 15:28:53



డాలస్: మహాత్మా గాంధీ మెమెరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (ఎంజీఎంఎన్‌టీ) ఆధ్వర్యంలో ఈనెల 15న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇర్వింగ్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ ప్లాజాలో ఈ వేడుకలు నిర్వహించారు. 600 మందికి పైగా ప్రవాస భారతీయులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంజీఎంఎన్‌టీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీమతి షబ్నం మోద్గిల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాత్మాగాంధీకి ఘన నివాళులర్పించారు. ఎంజీఎంఎన్‌టీ కార్యదర్శి రావు కాల్వల ప్రారంభోపన్యాసం చేస్తూ, శాంతి, అహింస ద్వారా దేశానికి స్వాంతంత్ర్య తీసుకురావడంలో భారత జాతిపిత మహాత్మాగాంధీ కీలకపాత్ర పోషించారని, స్వాతంత్ర్య దినోత్సవాన్ని మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాలోనే జరుపుకోవడం ఎంతో సమంజసమని అన్నారు. మహాత్ముని బోధలైన శాంతి, సామరస్యం నేటికీ అనుసరణీయమని అన్నారు. అక్టోబర్ 2న ఇదే వేదిక నుంచి జరుపుకొనే 'గాంధీ పీస్ వాక్'లోనూ అందరూ పాల్గొనాలని కోరారు. ఎంజీఎంఎన్‌టీ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ తోటకూర త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గౌరవవందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనమంతా అదృష్టవంతులమని, ఇలాంటి వేడుకల జరుపుకునే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఉన్న అమెరికా వంటి గొప్ప దేశానికి అంతా రుణపడి ఉన్నామని అన్నారు. బ్రిటిష్ దాస్యశృంఖలాల నుంచి భారత్‌కు విముక్తి ప్రసాదించి మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, లాల్‌బహదూర్ శాస్త్రి, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ వంటి పలువురు స్వతంత్ర్య యోధులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేస్తూ, ఆ మహనీయుల త్యాగనిరతిని కొనియాడారు. మాతృభూమి అయిన భారతదేశానికి సేవలందించేందుకు, దుష్టశక్తులైన ఉగ్రవాదం, అవినీతి, ఆడశిశివులను మొగ్గలోనే తుంచేయడం, నిరక్షరాస్యతకు వ్యతిరేకంగా పోరాడేందుకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గాంధీజీ పాపులర్ భజన్ 'రఘుపతి రాఘవ రాజారాం'ను ఎంజీఎంఎన్‌టీ బోర్డ్ డైరెక్టర్ తైయబ్ కుందవాలా ఆలపించారు. స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వారికి నివాళిగా ఒక నిమిషం పాటు అంతా మౌనం పాటించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ఎంజీఎంఎన్‌టీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ జాక్ గోధ్వాని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీఎంఎన్‌టీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సల్మాన్ ఫర్షోరి ముగింపు ఉపన్యాసం చేస్తూ, ఈ వేడుకకు ఆతిథ్యం ఇచ్చిన ఇర్వింగ్ సిటీతో పాటు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, సూరజ్ ఆర్ట్స్ ఫర్ ఫోటోగ్రఫీ, ఫన్ ఆసియా ఫర్ ప్రమోషన్ అండ్ పబ్లిసిటీ, డబ్ల్యుఎఫ్ఏఏ ఛానెల్ 8, టీవీ 9, టీవీ 5, ఎఐఎన్ఎ టీవీ, సరెగమ ఇండియన్ రెస్టారెంట్, హాజరైన ప్రముఖులు, వాలంటీర్లతో సహా సదస్సు విజయవంతానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.